ప్రజాశక్తి

మంగళవారం 9 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు



ఏకలవ్య ప్రవేశ పరీక్ష 20కి వాయిదా

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్లకు ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన ప్రవేశ పరీక్షను ఈ నెల 20కి వాయిదా వేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఆరవ తరగతి ఇంగ్లీష్ మీడియం కో ఎడ్యుకేషన్ పాఠశాలల్లో ప్రవేశంకు ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మేటివ్-2 జరుగుతున్నందున ఈ రాత పరీక్షను ఈనెల 20న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



1/70 చట్టానికి తూట్లు

›› విచ్చలవిడిగా గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు ›› ముడుపులకు ఆశపడి పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ :

పర్యాటక కేంద్రమైన అరకులోయ, ఎండపల్లి వలసలో 1/ 70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలతో పాటు బహుళ అంతస్తులు, షాపులపై షాపులు నిర్మిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో సంబంధిత అధికారులు ఎన్నికల బిజీలో ఉండటంతో ఇదే అదునుగా భావించిన కొంతమంది గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా పెరిగి పోతున్నాయి.

రోడ్లపైనే బహుళ అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో అధికారుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అరకులోయ సమీపంలోని ఎండపల్లి వలస, జ్యోతి థియేటర్ ఎదురుగా డుంబ్రిగూడ మండలానికి చెందిన గిరిజనేతరులు బినామీ పేర్లతో అనుమతులు లేకుండా దర్జాగా షాపులపై షాపులు నిర్మిస్తున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అక్రమ నిర్మాణాలు అరికట్టాలని ఎన్నిసార్లు సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులకు, పంచాయతీ అధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఫిర్యాదులు చేసినా కనీసం చలనం లేకపోవడం గమనార్హం.

1/ 70 చట్టం ఉన్నా గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఎందుకు మౌనం దాలుస్తున్నారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పి ఓలు దృష్టి సారించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు తెలిపారు.



జ్యోతి థియేటర్ ఎదురుగా గిరిజనేతరులు నిర్మిస్తున్న షాపులు



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎమ్మెల్సీ అనంతబాబును తక్షణమే అరెస్టు చేయాలి

- బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గం

- వైస్ ఎంపిపి పెంటయ్య, సిపిఎం నేత సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని కూటూరు గ్రామంలో ఈ నెల 6న శనివారం ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటన సందర్భంగా గిరిజన యువకులపై చేసిన దాడి ఘనటపై అనంతబాబుపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే ఆయన్ని అరెస్టు చేయాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పోలవరం పరిహారం పొందిన భూములకు అదనంగా ఎకరాకు రూ.5 లక్షలు, వ్యక్తిగత పరిహారం కింద రూ.10 లక్షలు ఇవ్వడం, పోలవరం నిర్వాసితులకు కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పన, జిఒ 3ను పునరుద్ధరించి చట్టబద్ధత, ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల, బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం, అటవీ సంరక్షణ సవరణ బిల్లు ఆమోదం వంటి సమస్యలపై ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్సీ అనంతబాబును ఆదివాసీ యువకులు ప్రశ్నించారని తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ అనంతబాబు కనుసన్నల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇంటికి వెళుతున్న యువకులు మిడియం శ్రీరాం, సోడే వినోద్‌లపై తుపాకులతో దాడి చేసి, గాయపరచడం దారుణమన్నారు. ఈ ఘటనలో పోలీసులపైనా, దాడికి కారణమైన ఎమ్మెల్సీ అనంతబాబుపైనా, వారి అనుచరులు ఆవుల మరియాదాసు, నాగిరెడ్ల విజయ్‌లపైనా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్నికల అధికారులు, ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. గాయపడ్డ వారితో పాటు 40మందిపై తప్పుడు కేసులు పెట్టి బెదిరించడం సమంజసం కాదన్నారు. వైసీపీ నాయకులు, జెడ్పీటీసీ తిరిగి గిరిజనులపై అబాండాలు వేయడం సరికాదన్నారు. గిరిజన ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీ అనంతబాబుకు కొమ్ము కాయడం, గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టడం గిరిజన జాతికే అవమానమని పేర్కొన్నారు. ఈ విధానాలకు ప్రజలు, గిరిజనులు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, మురళి, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలేరు వాగులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- అడ్డతీగల : అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామ సమీపంలో ఏలేరు వాగులో ఆ గ్రామానికి చెందిన పడాల వీరభద్రరావు (62) అనే వ్యక్తి ప్రమాదవశాస్తు వాగులో పడి మృతి చెందారు. వాగులో వీరభద్రరావు మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై అప్పలరాజు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పలరాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని గ్రామస్తులు చెప్పారు.

ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌ను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను విజయవంతం చేసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపైనే ఉందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. స్థానిక ఎపి గురుకుల కళాశాలలో అరకు నియోజకవర్గం హుకుంపేట, పాడేరు నియోజక వర్గం పాడేరు మండలాల ప్రిసైడింగ్ అధికారులకు శనివారం నిర్వహించిన మొదటి విడత ఒక రోజు శిక్షణకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. శిక్షణా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారులతో మాట్లాడుతూ, ఈఎంలు, వివి పాట్, కంట్రోల్ యూనిట్, 17ఎ రిజిష్టరు నిర్వహణపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అన్నీ తెలుసని అనుకోకుండా ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై పంపిణీ చేసిన పుస్తకాలను క్షుణ్ణంగా పదే పదే చదవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తు న్నామనే విషయం గుర్తించుకుని పని చేయాలని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని స్పష్టం చేసారు.

పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్ ముందుగా అసెంబ్లీ స్థాయి మాష్టర్ ట్రైనర్లతో (ఎ.ఎల్.ఎం.టిలు) సమావేశం నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి సంపూర్ణ విషయ పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన మొబైల్ యాప్‌లపై తగిన విధంగా శిక్షణ అందించి అవగాహన పెంచాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాలలో రహస్య పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. పోలింగ్ బూత్‌లలో ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సెక్టార్ అధికారుల వద్ద రెండు ఈవిఎం పరికరాలను రిజర్వులో ఉంచుతామని, అవి పనిచేయకుంటే వెంటనే మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. వి.ఎస్. శర్మ, తహశీల్దార్లు కల్యాణచక్రవర్తి, సోమేశ్వరరావు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయసునీత



నినాదాలు చేస్తున్న గిరిజనులు

రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల-గుమ్మడిగుంట, డల్లాపల్లి వరకు మంజూరైన తారు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. చీకుమద్దుల నుండి గుమ్మడిగుంట మీదుగా డల్లా పల్లి వరకు మంజూరైన ఎంజీఎన్ఆర్ఈజీ ఎస్ తారు రోడ్డు పనుల్లో భాగంగా మెటల్ రోలింగ్ చేశారని, అనంతరం నిలిపి వేశారన్నారు. సత్వరమే తారు రోడ్డు పనులు ప్రారంభించాలని సోమవారం నిరసన చేపట్టారు. రోడ్డు కోసం డల్లాపల్లి గ్రామంలో భూ సేకరణ చేసి ఏ ఇబ్బందులు లేకుండా అక్కడి ప్రజలను ఒప్పించామని, వారు భూములను రోడ్డుకు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం బాధాకరం అన్నారు,ఈ రోడ్డు ఏర్పాటు తో పాడేరు,హుకుంపేట, అనంత గిరి మండలాల్లోని 15 పంచాయితీ ల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన్ని అప్పల స్వామి,చిరంజీవి,వంతాల బాలకష్ణ, కొర్ర నాగేశ్వరరావు సంతోష్, రాజారావు, సింహాచలం, వెంకట్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరు జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కి మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించి, పనివారాన్ని తగ్గించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధనలక్ష్మి డిమాండ్ చేశారు ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో డిఎంహెచ్‌ఓకు ఆశాలతో కలిపి వినతి పత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇటీవల కాలంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేశామన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి ఒప్పుకున్న డిమాండ్లు పరిష్కరించాలని తెలిపారు. ఆశాలతో సబ్ సెంటర్ల వద్ద పారిశుధ్య పనులు చేయిస్తున్నారని తెలిపారు. రికార్డులు కొనుక్కోమని బలవంతంగా ఒత్తిడి తీసుకొస్తున్నారని, అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు పని చేయక పోయినా సొంత ఫోన్లు కొనుక్కొని పని చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని విమర్శించారు.సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగమ్మ, దాసమ్మ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలంటే


సిపిఎం అభ్యర్థి లోతాను గెలిపించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే రంపచోడవరం సిపిఎం అభ్యర్థి లోతా రామారావును గెలిపించి అసెంబ్లీకి పంపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఇరపా సత్యం అధ్యక్షతన సోమవారం జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. పోలవరం వలన కలిగే నష్టాలను, కష్టాలను సిపిఎం ముందే చెప్పిందని, అయినా పాలకవర్గాలు ప్రజల కష్ట నష్టాలను పట్టించుకోకుండా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టాయని గుర్తు చేశారు. టిడిపి, వైసిపిల అజెండాలో నిర్వాసితుల సమస్యలు లేవని, పోలవరం కాంట్రాక్టు ద్వారా వచ్చే కమిషన్‌పైనే వారి దృష్టి అంతా ఉందని విమర్శించారు. కరోనా, గోదావరి వరదల సమయంలో సిపిఎం మాత్రమే ప్రజలకు అండగా ఉండి సేవలు చేసిందని గుర్తు చేశారు. వరదల సమయంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి బురద ఉందని కాలు కింద కూడా పెట్టకుండా వెళ్లిన సందర్భాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూనే ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల కష్టాల్లో ఉంటే ఆదుకొనే నాయకులను మనం ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం మాజీ ఎమ్మెల్యేలు కుంజ బొజ్జి, సున్నం రాజయ్యలా ప్రజల కోసం పనిచేసే నాయకుడు కావాలని, వారి వారసుడుగా అటువంటి పోరాటగుణం, వ్యక్తిత్వం ఉన్న సిపిఎం అభ్యర్థి లోతా రామారావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

బిజెపికి మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పక్కన పెట్టడం ఖాయమని, అదే జరిగితే ఆదివాసీలకు చట్టాలు, హక్కులు ఉండవన్నారు. అడవుల నుండి ఆదివాసీలను తరిమేసి మైనింగ్, అటవీ సంపద దోచుకోడానికి అడవులంతా కార్పొరేట్లకు అప్పగిస్తారని తెలిపారు. అటువంటి బిజెపిని, పొత్తులో ఉన్న టిడిపిని, పరోక్షంగా మద్దతు తెలుపుతున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 3 రద్దు, బోయ వాల్మీకులను ఎస్టి జాబితాలో కలపడం వంటి విషయాల్లో వైసీపీ, టీడీపీ ఒకే తాను (బీజేపీ) ముక్కలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అభ్యర్థి లోతా రామరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, నాయకులు ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్, సోందే రామారావు, బుద్ధుల భద్రయ్య, సవలం రాము, సోయం వీరమ్మ, జి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేత వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిపిఎం నేతల ప్రచారం

ప్రజాశక్తి డుంబ్రిగుడ:కాఫీ రైతుల పోత్సాహక నిధులు ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం మండల నాయకుడు, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. కితలంగి పంచాయతీ సిపిఎం నేతలు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పివిటిజిలకు అంత్యోదయ కార్డులు అందలేదన్నారు. జిఒ 3పై వైసీపీ ప్రభుత్వం కనీసం రివ్యూ పిటిషన్ కూడా దాఖలు చేయాలేదని విమర్శించారు. గిరిజన చట్టాలు, హక్కులు సాధించుకోవాలన్నా, సమగ్రాభివృద్ధి జరగాలన్నా సిపిఎం అరకు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి.సూర్యనారాయణ, పాంగి సత్యనారాయణ, కితలంగి పంచాయతీ నాయకులు మహేష్, దేవగున్, నూకరాజు, మోహన్‌రావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సిపిఎం అభ్యర్థికే మా ఓటు

ఉమ్మడివరం, పులుసు మామిడి, రెడ్డి గుంపు, బూర్గువాడ, నాగేంద్రపురం గ్రామస్తుల తీర్మానం

ప్రజాశక్తి-విఆర్ పురం

ప్రజా సమస్యలపై అను నిత్యం పోరాడే సిపిఎం అభ్యర్థికి తమ ఓటు వేస్తామంటూ మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి ఉమ్మడివరం, రెడ్డి గుంపు, పెద్దమటపల్లి పంచాయతీ పరిధి బూర్గువాడ, పులుసు మామిడి, నాగేంద్రపురం గ్రామస్తులు తీర్మానించారు. సోమవారం ఆయా గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి సిపిఎం నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు పార్టీ నేతలతో మాట్లాడుతూ తమ గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించి, సమస్యలు వచ్చిన ప్రతి సందర్భంలో తమకు వెన్నంటి నిలిచిన సిపిఎంకే తమ ఓటు వేస్తామని చెప్పారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ ఆదివాసులకు అండగా నిలిచే పార్టీ సిపిఎం ఒకటేనని తెలిపారు. సిపిఎం సభ్యులు చట్ట సభల్లో లేనందుల వలన గిరిజన చట్టాలు, హక్కులకు భంగం కలుగుతుందని, అందువల్ల చట్టసభలకు సిపిఎం ప్రతినిధులను పంపాల్సిన అవసరం ఈ సమయంలో ఎక్కువగా ఉందని చెప్పారు. ఆదివాసీలంతా ఆలోచించి ఒక తాటిపైకి వచ్చి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పై గ్రామాల ఒరవడి మిగతా గిరిజన గ్రామాల్లో కూడా వస్తే సిపిఎం అభ్యర్థి సునయాసంగా గెలుస్తారని చెప్పారు. ఈ సమావేశంలో రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమటపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, కె.సత్యనారాయణ, చిక్కాల రామారావు, సోడి మల్లయ్య, జి.లక్ష్మణరావు, వీర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా నూనె రమేష్

ప్రజాశక్తి-విఆర్.పురం : మన్యం యువ కవి, రచయిత, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నూనె రమేష్ శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాదిక ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఇందులో పాల్గొన్న నూనె రమేష్ 'ఆలోచన అవసరం' అనే కవిత వినిపించి సభికుల, నిర్వాహకుల మన్ననలు, అత్యున్నత సత్కారం పొందారు. సాహిత్య రంగంలో నూనె రమేష్ చేస్తున్న సేవలను గుర్తించి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమాండ ప్రతాప్ ఆయన్ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. మారుమూల గ్రామమైన రేఖపల్లిలో పుట్టి అంచలంచలుగా సాహిత్యరంగంలో ఎదుగుతూ రాష్ట్ర స్థాయి పదవి చేపట్టిన నూనె రమేష్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు. రమేష్ మరెన్నో ఉన్నంత శిఖరాలను అందుకోవాలని అభిలాశించారు. తమ కుమారుడు రాష్ట్ర స్థాయిలో సాహిత్య సేవా చేస్తున్నందుకు నూనె రమేష్ తల్లి దండ్రులు నూనె అజరయ్య శాంతి ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా నూకాంబిక పండగ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో జల విద్యుత్తు కేంద్రం సమీపంలో వెలసిన నూకాంబిక అమ్మవారి పండుగ అమావాస్య సందర్భంగా కనుల పండగ నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భారీ అన్న సమారాధన ప్రజల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

వైభవంగా దారాలమ్మ ప్రధాన పండగ

రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం దారాలమ్మ ఘాట్ రోడ్‌లో వెలసిన దారాలమ్మ అమ్మవారి ప్రధాన పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారాలమ్మ అమ్మవారికి దేవాదాయశాఖ ఈవో సాంబశివరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. అమ్మవారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భారీ అన్నర సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మరో నాలుగు రోజులపాటు స్వామివారి సన్నిధిలో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ ఆరోగ్యసంస్థ నినాదానికి అనుగుణంగా మనిషికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక, సామాజిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పిఎవి, పిపిసి ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో 'నా ఆరోగ్యం నా హక్కు' అంశంపై నిర్వహించిన సదస్సు ను ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు పివి సుధాకర్ ప్రారంభించారు. ప్రధానవక్తగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించే హక్కును భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశిస్తోందన్నారు. ప్రజారోగ్యం, జీవించే హక్కుకు సంబంధించి పలు చట్టాలను వివరించారు. మరోవక్త డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ ఆరోగ్యరంగం ద్వారా వచ్చే పన్నులను ప్రభుత్వం ఆదాయ వనరుగా చూసుకుంటున్నప్పటికీ, ఆరోగ్యరంగం పురోగతిలోనే ఉందన్నారు. స్వాతంత్ర్యానంతరం మనిషి సగటు ఆయుర్దాయం 35ఏళ్ల నుంచి 75ఏళ్లకు రెట్టింపునకు మించి పెరిగిందన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కెఎన్ రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు కెవిపి చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు చిల్డ్రన్స్ ఎరీనాలో ఉగాది వేడుకలు

- అందరూ ఆహ్వానితులే : డిఆర్ఒ




డిఆర్ఒ మోహన్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ముఖ్య అతిథిగా, జాయింట్ కలెక్టర్ మయాంక్ కిశోర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొంటారని, ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేడుకకు అధికారులంతా తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. పంచాంగ పఠనం, సాంప్రదాయ నృత్యాలు, వేద పండితులు, అర్చకులకు సత్కారం, ఉగాది పచ్చడి వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫణి, విశాఖ ఆర్‌డిఒ డి.హుస్సేన్‌సాహెబ్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జి.జయదేవి, ఎపిటిడిసి జాయింట్ మేనేజర్ హరిరామ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి.రమణ పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి కళాకారులు

- పలువురికి ఉగాది పురస్కారాల ప్రదానం



కళాకారులకు అవార్డులు ప్రదానం చేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :తమ ప్రతిభా పాటవాలతో సమాజాన్ని జాగృతం చేసే కళాకారులు, అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తున్నారని పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఉపకార సచ్ఛందసేవాసంస్థ చైర్మన్, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కంచర్ల అచ్యుతరావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని, కళాకారులు డాక్టర్ రాపేటి అప్పారావు, పల్సెర్ ఇతాష్, రమేష్ పట్నాయక్ (సింగర్) ఏల్సర్ బైక్ ఝాన్సీ, 'కొరియోగ్రాఫర్ సిహెచ్ రమేష్, పి.సీత ప్రసాద్, లస్- డేవిడ్ రాజ్, జి.డింపల్, బొట్టా నాగేశ్వరరావు, నాట్యాచార్యులు సందీప్‌లకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా సంఘం.గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ కళానైపుణ్యం అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను ప్రోత్సహించడం, కళాకారులను సత్కరించడం అభినంద నీయమన్నారు..కార్యక్రమంలో కొరియోగ్రాఫర్, ఆర్.నాగరాజ్ పట్నయక్, శివ జ్యోతి, జనార్ధన్, పి. అరుణ్‌సాయి, ధనుంజయ్, ప్రసాద్, కల్యాణ్, అమర్నాథ్, విజయరమణి, సత్య పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జగదీశ్వరికి ఆంగ్లంలో డాక్టరేట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంగ్ల సాహిత్యంలో రచయిత్రి కావేరి నంబిసైన్ రాసిన నవలలపై ఆచార్య ప్రసన్నశ్రీ మార్గదర్శకంలో చేసిన అధ్యయనం చేసి సమర్పించిన థీసెస్‌కు చొక్కాకుల జగదీశ్వరి ఎయు పిహెచ్‌డి అందుకుంది. సోమవారం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో జగదీశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేశారు.



విసి నుంచి డాక్టరేట్ స్వీకరిస్తున్న జగదీశ్వరి

పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రావికమతం మండల కేంద్రంలో పోలీసులు విస్తతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రావికమతం, తట్టబంద, కింతలి, కొత్తకోటకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు.ఎన్నికల నిబంధనకు అనుగుణంగా నడుచుకోవాలని, కోడ్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని రావికముతమ్ ఎస్ఐ ధనంజయ నాయుడు తెలిపారు.

చీడికాడ:ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎన్నికల సంచార తనిఖీ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో మద్యం, నగదు, రవాణా నిరోధానికి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. స్థానిక పోలీసులు గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను చేపడుతున్నారు. మండలంలోని కోనాం చెక్ పోస్ట్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

కార్మిక నేతలను చట్టసభలకు పంపండి

- బిజెపితో అంటకాగిన వైసిపి, టిడిపి కూటమిలను ఓడించండి
- సిఐటియు విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్రనేత జగ్గునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత జగ్గునాయుడు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపిని, దానితో అంటకాగిన టిడిపి, జనసేన కూటమితోపాటు వైసిపిని చిత్తుగా ఓడించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కమిటీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల రక్షణ, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కార్మిక నాయకులను ఎన్నుకొని చట్టసభలకు పంపాలని కోరారు.

నగరంలో కెఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు విస్తృతస్థాయి సమావేశంలో జగ్గనాయుడు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను యాజమాన్యాల అనుకూలంగా నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చేశారన్నారు., కార్మికులకు ఉద్యోగభద్రత, కనీస వేతనాలు అమలుకాకుండా యాజమాన్యాలకు బిజెపి వంతపాడుతోందన్నారు. విభజిత ఆంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో తెలుగుదేశం, జనసేన పార్టీలు జత కట్టడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మేస్తానన్నా బిజెపితో కలిసిన వీరు, స్టీల్‌ప్లాంట్ రక్షణకు పోరాడతామనడం మరొకసారి కార్మికులు, ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. బిజెపికి ఐదేళ్లపాటు అన్ని విధాలా సహకరిస్తూ వచ్చిన వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి. కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. వెంకటరెడ్డి, పి.మణి, ఎస్. జ్యోతీశ్వరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు ఎన్.రామారావు, పలు కార్మిక సంఘాల నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

భాషా పరిజ్ఞానం అవసరం : డిఇఒ

- రిటైర్డు భాషా పండితులకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఘన సత్కారం



భాషా పండితులను సత్కరిస్తున్న రాష్ట్రీయ భాషా పండిత పరిషత్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగ విరమణ చేయనున్న పలువురు తెలుగు,హిందీ భాషల పండితులను రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం 10 వ తరగతి మూల్యాంకన కేంద్రంలో.పండిత పరిషత్ అధ్యక్షులు వై.దయానంద్ అధ్యక్షతన ఉత్తరాంధ్ర ఆర్‌జెడి విజయభాస్కర్ చెరో ఇద్దరు తెలుగు, హిందీ భాషాపండితులను సత్కరించారు. 62ఏళ్లు నిండుతున్న సమయంలో మూల్యాంకనకు వచ్చిన వారిని అభినందించారు.

డిఇఒచంద్రకళ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే విద్యార్థులకు జాతీయ భాషతోపాటు మాతృభాషలో పరిజ్ఞానం అవసరమన్నారు. విద్యార్థులు భాషానైపుణ్యంతోపాటు నైతిక విలువలు నేర్చుకోవాలని, దానికి ఉపాధ్యాయులు, పండితులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా వేపాడ నుంచి శ్రీనివాసరావు, తోట గరువు స్కూల్ నుంచి పద్మావతి, చంద్రంపాలెం నుంచి పిఎస్‌ఎస్ లక్ష్మి, ఆనందపురం హైస్కూల్ నుంచి మున్నా బేగం, గుర్రంపాలెం హిందీ పండితురాలు కుసుమ కుమారిలను సత్కరించారు. పండిత పరిషత్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఎస్‌వి.ప్రసాదరావు, డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్, డైట్ ప్రిన్సిపాల్ ముత్యాలనాయుడు, ఎస్ఎస్ఎ పిఒ శ్రీనివాసరావు, డిసిపి చైర్మన్ కృష్ణకుమార్, హెచ్‌ఎంల అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడిరాజు, కోడింగ్ సిసిఒ మురళి, సంఘ ప్రతినిధులు శంకర్, టివి రమణ,శివ, మధుమతి పాల్గొన్నారు.

శివాజీ పార్కులో 'ఎంవివి' ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 17,20 వార్డుల్లోని శివాజీపార్కులో విశాఖ ఎంపి, తూర్పు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ సోమవారం మార్నింగ్ వాక్ చేశారు. శివాజీపార్కులోవాకర్స్, సీనియర్ సిటిజన్స్, స్కేటింగ్ చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తూర్పు ఎమ్మెల్యేగా తనను, ఇతర వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు కార్యక్రములో20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్, వై కుమార్‌రెడ్డి, మజ్జి వెంకటరమణ, రవికిరణ్ రెడ్డి, ప్రేమ్ కుమార్, నైదాన పోలారావు, సుబ్బారావు, పైడి శ్రీను పాల్గొన్నారు.

84వ రోజుకు ఎంవివి పాదయాత్ర

తూర్పు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపి ఎంవివి సత్యనారాయణ నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం 84వ రోజుకు చేరుకుంది. 20వ వార్డు లాసెన్స్ బే కాలనీ, పోస్టాఫీస్ జంక్షన్‌లో స్థానిక వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులతో ఘనంగా స్వాగతించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని, వైసిపి సంక్షేమ పథకాలను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు.



శివాజీపార్క్ వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ ఎంవివి

సంప్రదాయబద్ధంగా ఏరువాక

గ్రామాల్లో కొత్త అమావాస్య శోభ
పలుచోట్ల నూకాలమ్మకు పూజలు



నాగలి లాగుతున్న చిన్నారులు

ప్రజాశక్తి- నక్కపల్లి:సంస్కృతి, సాంప్రదాయాల ప్రతీక పల్లెలు. ఏదైన పండుగ వస్తే చాలు ముఖ్యంగా పల్లె గ్రామాల్లో పెద్ద ఎత్తున సందడి కనపడుతుంది. కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ఉపమాక గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామంలో నూకాలమ్మ ప్రతిమలు (గరగలను) డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చారు. సోమవారం ఉదయం తాటి చెట్ల పేడలను పాతి వాటికి తాడుకట్టి ఊయలను తయారుచేసారు. ఈ ఊయలపై అమ్మవారి ప్రతిమలను (గరగలను) కూర్చొండబెట్టి ఊయల ఊపుతూ, పాటలు పడుతూ ఈ కార్యక్రమాన్ని ఎంతో సందడిగా గ్రామపెద్దలు, యువకులు నిర్వహించారు.

అనంతరం రామాలయం ఎదుట వున్న ఖాళీ ప్రదేశంలో నీళ్ళతో శుభ్రంగా నేలను తడిపి కట్టెలతో నాగళి (ఏరులు) తయారు చేసి చిన్నారులతో నాగళి లాగించి దుక్కు దున్నే తంతు నిర్వహించారు. ఇలా చేయడంతో కొత్త సంవత్సరంలో వర్షాలు సకాలంలో పడి పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని పెద్దల నమ్మకం. ఈ ఆచారాన్ని ప్రతీ ఏడాది ఉగాది ముందు రోజున ఉపమాక రామాలయం వద్ద చేయడం ఆనవాయితీగా వస్తుంది.

ఉల్లాసభరితంగా 'విజయం' ఉగాది ఉత్సవం

ప్రజాశక్తి -పిఎం పాలెం : విజయం స్కూల్ ఆధ్వర్యాన సోమవారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన చేపట్టిన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విశాఖపట్నం కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపక దర్శకులు కళారత్న ఎబి.బాల కొండలరావు, విశిష్ట అతిథులుగా అసోసియేట్ ప్రొఫెసర్ ఫైన్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ హెచ్ఒడి (గీతం) డాక్టర్ కొండుపర్తి మాల్యద, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫైన్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం గీతం అనుకూల ఆనంద శ్రీహరి, జాతీయ అవార్డు గ్రహీత తబలా ఆర్టిస్ట్ ఆల్ ఇండియా రేడియో ఎ గ్రేడ్ ఆర్టిస్ట్ డి.ధనంజయ, కొరియోగ్రాఫర్ కూచిపూడి ప్రదర్శకుడు ఆదిత్య అనుకూల హాజరయ్యారు. తెలుగు నూతన సంవత్సర ప్రారంభం గొప్పతనం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, సంప్రదాయ నృత్యాలతో విజయం చిన్నారులు అలరించారు. ప్రముఖ తబలా కళాకారులు ధనుంజయ్, ఆనంద విహారి బృందం సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముఖ్య అతిథులకు స్కూల్ యాజమాన్యం ఉగాది పురస్కార అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది.



ఉగాది ఉత్సవంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

16న పద్మనాభం మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల, గ్రామ స్థాయి అధికారులు శాఖల వారీగా పూర్తిస్థాయి సమాచారంతో మండల సమావేశానికి విచ్చేసి, విజయవంతం చేయాలని ఆదేశించారు.

రాజు మృతిపై ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - పాడేరు: వైసిపి చేనేత విభాగం రాష్ట్ర సెక్రటరీ, ఆర్కే టైలర్స్ అధినేత జి.రాజు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారంపాడేరులోని ఆయన పార్థివ దేహానికి స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి తీరని లోటని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి పాడేరు నియోజక వర్గం అభ్యర్థి కిల్లు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ రమణమూర్తి నివాళులర్పించారు.

మైసూర్ - భువనేశ్వర్ మధ్య
నేడు, రేపు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, మైసూర్-భువనేశ్వర్ మధ్య ఒక ట్రిప్ ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. 06215 మైసూర్, భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈనెల 9న మంగళవారంఉదయం 4.15 గంటలకు మైసూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడ చేరుకుని, ఐదు నిమిషాల హాల్ట్ తర్వాత 2.35 గంటలకు బయలుదేరి అదేరోజు 10.40 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.



తిరుగు ప్రయాణంలో 06216 భువనేశ్వర్, మైసూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు, ఈనెల 10న బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భువనేశ్వర్‌లో బయలుదేరి, రాత్రి 21.30 గంటలకు దువ్వాడ చేరుకుని, మరల 21.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 19.15 గంటలకు మైసూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మాండ్య, బెంగళూరు సిటీ, బెంగళూరు కంటోన్మెంట్, కృష్ణరాజపురం, వైట్‌ఫీల్డ్, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయి.

మిమ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సమ్మె చేస్తున్న కార్మికులపై నిర్బంధం, అరెస్టులు తగవు
- సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ) : విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్) కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కె.ఎస్‌వి కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 65 రోజులుగా సమ్మె చేస్తున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, వారిపై యాజమాన్యం నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమ్మెలో ఉన్న 17 మంది కార్మికులను, వారికి సంఘీభావం తెలిపిన సిఐటియు రాష్ట్ర, జిల్లా యూనియన్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయించి జైలుకు పంపడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తరుపున తీవ్రంగా ఖండించారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని, మిమ్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, అరెస్ట్ చేసిన కార్మికులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయ పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందన్నారు.

'తూర్పు'లో వెలగపూడి ముమ్మర ప్రచారం



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ప్రస్తుత టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం ఉదయం 6 గానట్ల నుంచి ఎంవిపి కాలనీ సెక్టార్ 4లో ఇంటింటా తిరుగుతూ, ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించరు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు వివరించారు వచ్చే ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను సైకిలు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని వీర నారాయణం, ముకుందపురం, పోతనపూడి, వీరవిల్లి గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై కూటమి నేతలు ప్రచారం నిర్వహించించారు. ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛను రూ.4000, వికలాంగుల పెన్షన్ రూ.6000 ఇస్తామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాజ్ కుమార్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఉండూరు రాజు, ప్రధాన కార్యదర్శి మట్టా చంటి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి నాగమణి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధిలో ఉన్న కురుపల్లె కాలనీ, బర్లపేట, కొర్రపల్లి, రేవిడి పంచాయతీలో రేవిడి, రౌతులపాలెం, రౌతులపాలెం కాలనీలో సోమవారం భీమిలి అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి నాగోతి నాగమణి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ఆడబిడ్డనని, ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.



రేవిడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాగమణి

తగరపువలస : భీమిలి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నాగోతి నాగమణి మంగళవారం భీమిలి మండలంలోని మజ్జివలస, కృష్ణంరాజుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు.

15,16వ తేదీల్లో ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి-నక్కపల్లి : ఈనెల 15 ,16వ తేదీల్లో పిఒ, ఓపి ఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.గీతాంజలి తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ, పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ స్కూలులో సుమారుగా 770 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బూత్ లెవెల్ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అదే రోజు నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజకీయ నేతలు పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలని సూచించారు.

గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు సచివాలయం పరిధిలోని వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజాక్షేత్రంలో తమ వంతుగా ప్రచారం చేపడతామన్నారు. జోగుంపేట సచివాలయ పరిధిలో సాలికమల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం గ్రామాల వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా పత్రాలను సమర్పించారు.